నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 8 జూన్ 2024 HYDERABAD




## అత్యవసర సేవలపై ఈవీడీఎం శిక్షణ

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలంలో ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయ చర్యలపై జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. నాగోల్ ఫతుల్లాగూడలోని ట్రైనింగ్ సెంటర్‌లో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరదలతో ముంపు, ప్రాణాపాయ పరిస్థితులు, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి? ప్రమాదం జరిగినప్పుడు ఏం చేయాలి..? అన్న విషయాలపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. వచ్చే సోమవారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తి గల అపార్ట్‌మెంట్, బస్తీ వాసులు, ఎన్జీవో, ట్రేడ్ యూనియన్ సభ్యులు ముందుకొచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు.

# గాలివానొస్తే.. అంతే!



### ముందస్తు క్షేత్రస్థాయి చర్యలు చేపట్టని విద్యుత్ శాఖ
### తరచూ అంతరాయాలతో నగరవాసుల సతమతం
### సరఫరా పునరుద్ధరణలోనూ నిర్లక్ష్యం
### అస్తవ్యస్తంగా గ్రేటర్ విద్యుత్ వ్యవస్థ

సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రం వచ్చిన ప్రారంభంలోనే గత బీఆర్ఎస్ సర్కారు విద్యుత్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లింది. ఫలితంగా పదేండ్లుగా రాష్ట్రంలో విద్యుత్ కోతలు, అంతరాయాలు అనే మాటకు చోటు లేకుండా పోయింది. రాష్ట్రంలో నివాసముంటున్న ప్రజలందరికీ, వ్యాపార కార్యకలాపాలకు ఎంత అవసరమైతే అంత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. అలాంటి వ్యవస్థ 5 నెలల్లోనే అస్తవ్యస్తంగా మారింది. అందుకు ప్రత్యేక నిదర్శనం ఈ ఏడాది వేసవి కాలంలో వచ్చిన ఈదురుగాలులకు, తాజాగా కురుస్తున్న వర్షాలతో విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు తోడు గంటల తరబడి సరఫరాను పునరుద్ధరించలేని పరిస్థితి. గత కేసీఆర్ ప్రభుత్వం డిస్కం పరిధిలో పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చడం కోసం రూ. 14,063 కోట్లు వెచ్చిస్తే, అందులో రూ.10 వేల కోట్లను గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 9 సర్కిళ్ల పరిధిలోనే ఖర్చు చేశారు. ఈ 9 సర్కిళ్ల పరిధిలోనే 60 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడి నుంచే డిస్కంకు మంచి ఆదాయం వస్తోంది. అలాంటి చోటే తరచూ విద్యుత్ అంతరాయాలతో వినియోగదారులకు ఇబ్బందులే కాదు, సంస్థకు రావాల్సిన ఆదాయంలోనూ కోత పడుతోంది.

### నిర్వహణలో వైఫల్యం..

ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభమైన మార్చి నుంచి మే నెల 14 తేదీ వరకు రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదైంది. ఈ ఏడాది వేసవిలో అత్యధిక డిమాండు 90.68 మిలియన్ యూనిట్లు ఉంది. గతేడాది(2023) ఏప్రిల్ నెలతో పోల్చుకుంటే.. ఈ ఏడాది (2024) ఏప్రిల్‌లో ఒకేసారి 38.89 శాతం విద్యుత్ వినియోగం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నది. అదే సమయంలో గరిష్ఠ డిమాండు అత్యధికంగా 4241 మెగావాట్లు నమోదవ్వగా, వృద్ధిరేటు 35.91 శాతంగా నమోదైంది.ఈ స్థాయిలో డిమాండు తట్టుకునేలా గత కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. ఇక చేయాల్సిందల్లా నిర్వహణ, మరమ్మతులు మాత్రమే. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సరఫరా వ్యవస్థలో నిర్వహణ లోపించింది. నిరంతరం నాణ్యమైన సరఫరా చేసేందుకు అవసరమైన విధంగా క్షేత్ర స్థాయిలో లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్వహణ చేపట్ట లేదు. దాని ఫలితంగానే ఏమాత్రం గాలి వాన వచ్చినా.. విద్యుత్ తీగలపై చెట్లు, వాటి కొమ్మలు కూలుతుండటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది.

### ఇటీవల ఘటనలే నిదర్శనం..

గాలి వానతో వర్షం కురిసిందంటే చాలు.. చెట్లు, కొమ్మలు తీగలు, స్తంభాలపై పడటం.. కరెంటు సరఫరా నిలిచిపోవడం సర్వసాధారణంగా అన్నట్లుగా మారింది. ఇటీవల మూడు సంఘటనల్లో గంటలు గడిచినా.. సరఫరా లేకపోవడంతో సబ్ స్టేషన్లను విద్యుత్ వినియోగదారులు ముట్టడించారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే ముందస్తుగానే క్షేత్రస్థాయిలో నెట్‌వర్క్‌ను పరిశీలించి మరమ్మతులు చేపట్టాల్సిన విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరించారు. ఆలస్యంగా తూతూ మంత్రంగా నిర్వహణ, మరమ్మతులు చేపట్టారు. దాని ఫలితంగానే ఎక్కడ చూసినా.. చెట్లు కూలిపోవడం, కొమ్మలు తీగలపై పడిపోవడం, కొన్ని చోట్ల కేబుల్ కాలిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

## పూడికతీతలో అలసత్వం

సిటీబ్యూరో: గ్రేటర్‌లో నాలా పూడికతీత పనుల్లో జీహెచ్ఎంసీ అలసత్వం ప్రదర్శిస్తోంది. గత నెల 31వ తేదీ నాటికే నిర్దేశిత గడువు పూర్తి చేసుకొని వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పనులపై నిర్లక్ష్యం చూపారు. దాదాపు 18 రోజుల పాటు కాంట్రాక్టర్లు సమ్మెలోకి వెళితే ఆ కారణంతోనే పూడికతీత పనుల్లో జాప్యం జరిగిందని చెబుతున్న అధికారులు.. రోజూ వర్షాలు పడుతున్నా.. కొన్ని చోట్ల పనుల్లో వేగం పెంచడం లేదు. శేరిలింగంపల్లి, చార్మినార్, ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్ల పరిధిలో నాలా పూడికతీత పనులు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. సంబంధిత జోన్‌లో క్షేత్రస్థాయిలో 70 శాతం కూడా పనులు పూర్తి చేయలేదని, కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లింపులు లేకనే పనులు నత్తనడకన జరుగుతున్నట్లు సమాచారం. ఖైరతాబాద్ జోన్‌లోని ఐదు సర్కిళ్లు మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ , బల్కాపూర్ నాలా డీసిల్టింగ్‌కు సంబంధించి పనులపై అనుమానాలు ఉన్నాయన్న చర్చ జరుగుతున్నది. మొత్తంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో పూడికతీత పనులు పారదర్శకంగా జరగగా పోగా, నాలా పరీవాహక ప్రాంత ప్రజలు భారీ వర్షం వస్తే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన పరిస్థితి నెలకొన్నదని స్థానికులు వాపోతున్నారు.



# పక్కాగా.. లెక్కింపు

### ఆస్తులు, భవనాల సమగ్ర వివరాలతో డిజిటల్ రికార్డులు

### 18 నెలల పాటు కొనసాగనున్న జీఐఎస్ ఆధారిత సర్వే
### నియో జియో ఏజెన్సీకి బాధ్యతలు అప్పగింత

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో భవనాలు, ఆస్తులను పక్కాగా లెక్కించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఈ మేరకు జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సాంకేతికతతో సర్వే చేయనున్నారు. దేశంలోని అన్ని పట్టణాలు, నగరాలను మ్యాపింగ్ చేయాలన్న కేంద్ర సర్కారు ఆదేశాలతో.. ఐటీ విభాగం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఆసక్తి ఉన్న సంస్థల నుంచి టెండర్ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. అర్హత కలిగిన నియో జియో ఏజెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించింది. 18 నెలల పాటు సర్వే చేసి..రెండేండ్ల పాటు సదరు ఏజెన్సీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిర్వహించనున్నది. ఈ సర్వేలో గ్రేటర్‌లో అసలు నిర్మాణాలు ఎన్ని ఉన్నాయి? వాటిలోని అంతస్తులు , ఎత్తు, విస్తీర్ణం, ఇతరత్రా వివరాలపై డిజిటల్ రికార్డులు రూపుదిద్దుకోనున్నాయి. ప్రతి భవనం సరిహద్దులను తెలుసుకునేందుకు సిటిజన్ సెంట్రిక్ సర్వీస్‌తో ఉపగ్రహ డేటా, డ్రోన్లను ఉపయోగించాలని అధికారులు నిర్ణయించారు. సర్వే వివరాలను ఏ రోజుకు ఆ రోజు సంబంధిత సర్కిల్ అధికారులు సమాచారాన్ని చేరుస్తారు. మౌలిక సౌకర్యాల కల్పనకు నగరాభివృద్ధి ప్రణాళికలకు ఈ సమాచారం ఉపయోగపడనున్నదని అధికారులు తెలిపారు.

### క్లిక్ చేస్తే సమగ్ర వివరాలు..

జీఐఎస్ ఆధారిత సర్వే ఇప్పటికే మహారాష్ట్రలోని బృహన్, ముంబై కార్పొరేషన్ అమలు చేస్తున్నది. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ అధికారులు అక్కడి పనితీరును పరిశీలించి వచ్చి నగరంలో అమలుకు సిద్ధమయ్యారు. దాదాపు 20 లక్షల ఇండ్లను సర్వే చేయనున్నారు. ముఖ్యంగా ఇంటి నంబర్లు, వీధులు, కాలనీలను గుర్తించేలా సర్వే ఉంటుంది. ప్రతి ఇంటిని దగ్గర నుంచి చూసినట్లు 3డీ పటాలుంటాయి. క్లిక్ చేస్తే.. నిర్మాణం , ఎన్ని అంతస్తుల్లో ఉన్నది? ఎంత విస్తీర్ణం వంటి వివరాలు తెలుస్తాయి. సమగ్ర డిజిటల్ పటాలతో ఆస్తిపన్ను ఎక్కువగా వసూలయ్యే ఇండ్లు, తక్కువగా చెల్లించేవి.. పన్ను పరిధిలో లేని కట్టడాలను గుర్తించవచ్చు. నివాస అనుమతుల భవనాల్లో వాణిజ్య కార్యకలాపాలు న్నాయా అనేది తెలుసుకునే వీలుంటుంది. పన్ను విధింపులో అవకతవకలు వెలుగులోకి వస్తాయి.

### 17 లక్షలకు పైగా భవనాలు..

జీహెచ్ఎంసీలో ఆస్తిపన్ను పరిధిలోని భవనాలు 17 లక్షలకు పైగా ఉన్నాయి. ఏటా దాదాపు 20వేల వరకు కొత్త నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఆ మేరకు ఆస్తిపన్ను రావడం లేదు. ఏటా రూ. 1900 కోట్ల మేర ఆదాయం కష్టంగా రాబడుతున్నారు. వాస్తవానికి రూ. 2500 కోట్ల మేర రావాల్సి ఉన్నదని అంచనా. ఈ జీఐఎస్ సర్వేతో ఆస్తులు, భవనాల లెక్క పక్కాగా ఉంటుందని, తద్వారా జీహెచ్ఎంసీ రెవెన్యూ పెరగడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా వరద నాలాలు, మురుగునీటి నాలాలు, రహదారులు, చెరువులు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, మురుగు నీటి లైన్లు, అపార్ట్‌మెంట్లు, గృహాలు, వాణిజ్య సముదాయాలు, పార్కులు, పచ్చదనం, దవాఖానలు, ఖాళీ సంస్థలు, వంటి అనేక రకాల సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

## రుతుపవనాల ప్రభావంతో..

సిటీబ్యూరో: రుతుపవనాల ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఉప్పల్, నాగోల్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.


నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేపమందు కోసం..

# నేడు చేప ప్రసాదం పంపిణీ

సిటీబ్యూరో/అబిడ్స్, సుల్తాన్‌బజార్, జూన్ 7 : మృగశిర కార్తెను పురస్కరించుకొని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం బత్తిని కుటుంబం చేప ప్రసాదం పంపిణీ చేయనున్నది. ఈ నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇప్పటికే ఎగ్జిబిషన్ మైదానానికి చేరుకున్నారు. టోకెన్లు కొనుగోలు చేసి..మైదానంలోనే సేద తీరుతున్నారు. ఈ నేపథ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు చేస్తున్నాయి. ఎగ్జిబిషన్ మైదానంలో నేడు తెల్లవారుజాము నుంచి మరుసటి రోజు ఉదయం వరకు చేప ప్రసాదం పంపిణీ ఉంటుందని, ఈ నేపథ్యంలో 2 రోజులు పాటు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ వెల్లడించారు. ఇదిలా ఉంటే మృగశిర కార్తెను రోజు చేపలు తినడం ఆనవాయితీ కావడంతో శుక్రవారం ముషీరాబాద్ చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసింది.


కిక్కిరిసిన ముషీరాబాద్ చేపల మార్కెట్

# ప్రైవేటు బడి.. అంతులేని దోపిడీ

## ఫీజులు ఘనం.. నియంత్రణ శూన్యం

### అధిక ఫీజులతో తల్లిదండ్రులను పీల్చిపిప్పిచేస్తున్న ప్రైవేటు స్కూళ్లు
### ఇప్పటికే ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ




'అది నగరంలోని సికింద్రాబాద్‌లో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల. అందులో వేసవి సెలవులు ప్రారంభం కాకముందే అడ్మిషన్ల క్రతువు ముగిసింది. ఎల్‌కేజీకి ఏడాది రూ. లక్ష, డొనేషన్ 1-2 లక్షలు. ఖాళీలను బట్టి డిమాండ్. ఇంతటితో ముగియలేదు.. పుస్తకాలను సైతం వేల రూపాయలు నిర్ణయించి విక్రయించేశారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. ఏడాది ముగిసే వరకు ఖర్చులన్నీ కలిపి మరో లక్షన్నర వరకు ఉంటాయని రజిత అనే పేరెంట్ తెలిపారు.'

'స్కూళ్ల ఫీజులపై నియంత్రణ లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. యాజమాన్యాలను ప్రశ్నిస్తే చదివితే చదివించండి లేకపోతే అడ్మిషన్ రద్దు చేసుకోండి. ఎవరికీ చెప్పకున్నా.. తమను ఏమీ చేయలేరు. మా రూల్స్ ఇంతే ఉంటాయి. మా స్కూల్‌కు ప్రత్యేక నిబంధనలు ఉంటాయి.' అని బెదిరిస్తున్నారని మరో పేరెంట్ ప్రవళిక ఆవేదన వ్యక్తం చేశారు'.


సిటీబ్యూరో, జూన్ 7 ( నమస్తే తెలంగాణ ) :విద్యను వ్యాపారంగా మలిచి.. తల్లిదండ్రులను పీల్చిపిప్పిచేసి.. విద్యార్థులను ర్యాంకుల పేరుతో బట్టీ పట్టించి.. తరగతికో రేటు కట్టి చదువును అమ్మకపు సరుకుగా చేస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. నగరంలో ఇబ్బడి ముబ్బడిగా పాఠశాలలు పుట్టుకొస్తూ.. ఆర్భాట ప్రచారాలతో విద్యార్థులను మోసం చేస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు కరువయ్యాయి. ఒక్క బిడ్డ చదువుకోవాలంటే ఎల్‌కేజీ మొదలు.. పదో తరగతి వరకు డొనేషన్లు, స్కూల్ ఫీజులు, పుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రాజెక్టులు, బస్సు ఫీజులు ఇతర ఖర్చులతో మోత మోగుతున్నదని విద్యా వేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే ప్రైవేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందంటే వాటి లాభాల దూరదృష్టి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొంటున్నారు.

### నియంత్రణ ఏదీ..?

నగరంలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు 2వేలకు పైగా ఉన్నాయి. వీటిలో విద్యా వ్యాపారం అడ్డూ అదుపు లేకుండా పోతోంది. స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తదితర బోర్డుల పేరిట ఫీజుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్నా పర్యవేక్షణ గానీ, నియంత్రణ గానీ మచ్చుకైనా కనిపించడం లేదు. నాణ్యమైన విద్యాబోధన, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నమ్మబలుకుతూ గత ఏడాది కంటే యాభై నుంచి నూరు శాతం వరకు ఎక్కువగా ఫీజులను వసూలు చేసే ప్రణాళికలను యాజామాన్యాలు అమలు చేస్తున్నాయి. అయితే ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ తమ పరిధిలో లేదంటూ విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఫీజుల వ్యవహారమంతా ఆయా స్కూళ్ల గవర్నింగ్ బాడీ చూసుకుంటుందని సమాధానమిస్తున్నారు.

### నిబంధనలకు తూట్లు..!

ప్రైవేటు స్కూళ్ల పర్యవేక్షణ, ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం 1994లో జీవో నంబర్ 1 జారీ చేసింది. కానీ ఈ జీఓను అటు అధికారులు, ఇటు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ఇందులోని 12వ నిబంధన ప్రకారం ప్రతి ప్రైవేటు విద్యా సంస్థ తమ వార్షికాదాయ వ్యయాలను ఆడిట్ చేయించాలి. అనంతరం ఆ రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించాలి. కానీ ఒక్క ప్రైవేటు పాఠశాల కూడా అలా చేయడం లేదు. అంతేకాదు మొత్తం వార్షికాదాయంలో స్కూల్ సిబ్బంది జీతాలు, ఫర్నీచర్, అభివృద్ధి ఖర్చు పోగా, మిగిలిన దానిలో కేవలం 5 శాతాన్నే లాభంగా తీసుకోవాలి. కానీ వాస్తవానికి ఈ నిబంధన ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. మౌలిక సదుపాయాల కల్పన పేరిట భారీగా ఖర్చు చూపిస్తుంటారని విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి స్కూల్‌లోనూ యాజమాన్య ప్రతినిధులు, టీచర్లు, తల్లిదండ్రులతో కూడిన గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలి. ఆ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా గవర్నింగ్ బాడీ విద్యార్థుల ఫీజులను నిర్ణయించాల్సి ఉంటుంది. ఏటా ఫీజుల వివరాలు, అయిన ఖర్చుతో పాటు వార్షిక అకడమిక్ నివేదికను తయారు చేయించి అధికారుల ముందుంచాలి. దీనిని వారు ఆమోదించాలి. అయితే స్కూల్ పెట్టినప్పటి నుంచి ఏ ఒక్క పాఠశాల కూడా వార్షిక అకడమిక్ నివేదికను తయారు చేయించడం లేదని నిపుణులు చెబుతున్నారు. చూసీచూడనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు. జీవో నెంబర్ 1ను పక్కాగా అమలు చేయాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం 2007లో జీఓ నంబర్ 2ను విడుదల చేసింది. ఇందులో భాగంగా ఫీజులపై చర్చించి ఖరారు చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అది కూడా ఇప్పుడు కనుమరుగైంది. జీవో 88 ప్రకారం 250 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్యను అందించాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క స్కూలు కూడా ఈ నిబంధనలు పాటించడం లేదు. ఇరుకు గదుల్లో, చుట్టూ వాహనం తిరిగే స్థలం లేని భవనాల్లో స్కూళ్లను ఇష్టానుసారంగా నడిపిస్తున్నారు.




### విపరీతమైన భారం పడుతోంది



-జగదీశ్ కుమార్, జనరల్ సెక్రటరీ, నియోకర్సర్ సొసైటీ

ఇష్టానుసారంగా పెంచుతున్న ఫీజులతో తల్లిదండ్రులపై విపరీతమైన భారం పడుతోంది. ఫీజులపై ఎవరికీ ఫిర్యాదు చేయాలి? ఎలా ఫిర్యాదు చేయాలో కూడా పేరెంట్స్‌కు తెలియడం లేదు. ఏ స్కూళ్లలో కూడా లాటరీ సిస్టం పెట్టడం లేదు. ఇంతమంది పేదలకు నిబంధనల ప్రకారం ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చామని ప్రకటించడం లేదు. కనీసం నోటీసు బోర్డు కూడా పెట్టడం లేదు. ప్రైవేటు స్కూళ్లను కట్టడి చేయకపోతే విద్య అనేది అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి నిబంధనలు పాటించని స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలి.

### కఠిన చర్యలు తీసుకోవాలి



-మోత్కూరి రాంచందర్, కౌన్సెలింగ్ సైకాలజిస్టు

చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను రెండున్నర ఏండ్ల నుంచే స్కూళ్లకు పంపిస్తున్నారు. ఇది సరైనది కాదు. స్కూల్, ట్యూషన్ల పేరుతో చదవమంటూ ఒత్తిడి తీసుకురావడం వల్ల పిల్లలు మానసికంగా కుమిలిపోతారు. డబ్బులు చెల్లించాం కదా అని పిల్లలపై పేరెంట్స్ ఒత్తిడి చేస్తున్నారు. నగరంలో చాలా స్కూళ్లు చిన్న చిన్న గదుల్లో, వెంటిలేషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉంటాయి. చిన్నారులకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉన్నది. నిబంధనలు పాటించని స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.